క్లుప్తంగా

ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.9.79 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న భక్తులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని శ్రీరేణుకా ఎల్లమ్మ జాతర హుండీ లెక్కింపు శనివారం ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహించారు. హుండీ ద్వారా రూ.9,79,279 ఆదాయం సమకూరింది. అలాగే బంగారం, వెండితో పాటు రెండు విదేశీ కరెన్సీ నోట్లు భక్తులు కానుకగా సమర్పించారు. గత ఏడాది జాతర ఆదాయం రూ.8,05,385 రాగా ఈ ఏడాది అదనంగా రూ.1,73,894 ఆదాయం వచ్చింది. వచ్చిన ఆదాయాన్ని యూనియన్ బ్యాంక్‌లో జమ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కిషన్ రావు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకుడు రంగారావు, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు పూదరి లక్ష్మీనారాయణ గౌడ్, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, గోమాత సేవా పరిషత్, ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న డీఎం సుఖేందర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ ఆధ్వర్యంలో సిద్దిపేట డిపోలో రూ.లక్షే లక్ష్యం అంశంపైన కార్మికుల కుటుంబ సభ్యులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉత్తమ రచన చేసినవారిని డీఎం సుఖేందర్‌రెడ్డి అభినందించారు. సిద్దిపేట డిపోలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు విధి నిర్వహణకే అంకిత కాకుండా ప్రతీనెలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి వారిని ఆనందింపచేయాలనే ఉద్దేశంతో నిర్వహించామన్నారు. డిపోకు రూ.1.50 లక్షల ఆదాయం అదనంగా తీసుకురావాలన్నారు. సిద్దిపేట డిపోను లాభాల బాటలో తీసుకరావడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సూపర్‌వైజర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పూత దశలో భూమిలో కలియదున్నాలి



జీలుగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ పద్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): జీలుగ పంట పూతదశలోకి రాగానే భూమిలో కలియదున్నాలని, దీంతో భూమి సారవంతంగా మారి పంట దిగుబడి పెరుగుతుందని ఏడీఏ పద్మ రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని అల్లీపూర్, మైలారం, కిష్టాపూర్ గ్రామాల రైతులు సాగుచేస్తున్న జీలుగ పంటను పరిశీలించారు. అలాగే ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చౌడు భూముల్లో ఎక్కువగా జీలుగ సాగు చేయాలన్నారు. రైతులు పంటల సాగుకు సేంద్రీయ ఎరువులు వినియోగించాలని, తద్వారా పంట దిగుబడి పెరగడంతో పాటు మంచి పోషకాలు కలిగిన పంట లభిస్తుందన్నారు. అంతేకాకుండా చీడపీడల బెడద తగ్గుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గి సరైన దిగుబడి రాదన్నారు. కార్యక్రమంలో ఏఓ జయంత్ కుమార్, ఏఈఓ గౌతమి, పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

హుస్నాబాద్: ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, సిగిరెట్లను శనివారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని రాథోర్ నాకుల్ సింగ్‌కు చెందిన హోల్‌సెల్ కిరాణా షాపులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మొత్తం రూ.25,624 విలువ గల సిగిరెట్లు, గుట్కాలు, అంబర్, బ్లూబుల్ గుర్తించి స్వాధీనం చేసుకుని విక్రేతపై కేసు నమోదు చేశారు.



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

పెట్టుబడి సాయం అందించాలి

ములుగు(గజ్వేల్): రైతులు సాగుచేసే ప్రతీ ఎకరానికి పెట్టుబడి సాయాన్ని అందిచాలని మండల పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి కోరారు. మండల కేంద్రమైన ములుగులోని రైతు వేదికలో శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అత్యవసర సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా అమలు, విధి విధానాలపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని పెంచి రైతులకు రైతుబంధు అందజేయాలన్నారు. అనంతరం సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రగతి, పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి రమేష్‌బాబు రైతుల అభిప్రాయాలు నమోదు చేసుకున్నారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ ఎకరానికి పెట్టుబడిసాయం అందించాలని కోరగా, మరికొందరు పది ఎకరాలకు మాత్రమే పరిమితి విధించి అసలైన రైతులకే రైతు భరోసా ఇవ్వాలన్నారు.

ఆర్థిక చేయూత అందించాలనే ..

వర్గల్(గజ్వేల్): రైతు భరోసా ద్వారా రైతులకు ఆర్థిక చేయూత అందించాలనే ధ్యేయంతో ప్రభుత్వం రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టినట్లు వర్గల్ పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి శేషశయన, డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రఘోత్తంరెడ్డి తెలిపారు. శనివారం పీఏసీఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వివిధ గ్రామాల రైతుల నుంచి రాతపూర్వకంగా అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. వారి అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపుతున్నట్లు వెల్లడించారు.

మిట్టపల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద ..

సిద్దిపేటఅర్బన్: రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణలో భాగంగా శనివారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి మహేష్ హాజరై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.



ములుగులో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి

చెత్తను వేరుచేసి ఇవ్వాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని లేనిపక్షంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం జరిమానా విధిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత హెచ్చరించారు. పట్టణంలోని 7వ వార్డులో చెత్త వేరుచేసే ప్రక్రియపై తెలంగాణ బసిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి యాజమానులు చెత్తను వేరుచేసి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు. పొడి చెత్తను వేరుచేసి ఇస్తే దానిని రీసైక్లింగ్‌కు పంపిస్తామన్నారు. తడిచెత్తతో ఎరువు తయారు చేసుకొని ఇంటిలోని మొక్కలకు వాడుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ చిత్తారి పద్మ, కోఆప్షన్ సభ్యురాలు శ్రీలత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



చెత్తను వేరుచేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

రైతుల ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ సత్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): అంతాయిగూడ గ్రామ రైతులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని గ్రామ మాజీ సర్పంచ్ సత్యం అన్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన రైతులు నర్సయ్య, కొండయ్యలు తమ భూమిని గ్రామ మాజీ సర్పంచ్ అక్రమంగా రికార్డుకు ఎక్కించుకున్నారని ఆరోపిస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై శనివారం మాజీ సర్పంచ్ సత్యం జగదేవ్‌పూర్‌లో విలేకర్లతో మాట్లాడారు. గ్రామంలో 164 సర్వే నంబర్‌లో గల వంద ఎకరాల భూమిలో గ్రామంలోని చాలా మంది రైతులు ఏళ్ల తరబడి కబ్జాలో ఉన్నారని, రికార్డు లేదని ఇదే సమస్యను పలుమార్లు ప్రభుత్వాల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకపోయినట్లు తెలిపారు. అయినా భూ సమస్య పరిష్కారం కాకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఆ సర్వే నంబర్‌లో ఎలాంటి లావాదేవీలు కాలేదని, కావాలనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. రైతుల పక్షాన భూ సమస్య పరిష్కారం కోసం తాను కూడా ముందుంటానన్నారు.

ఆర్భాటాలే తప్ప ఆచరణ లేని ప్రభుత్వం

- వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు

మిరుదొడ్డి(దుబ్బాక): హంగు ఆర్భాటాలే తప్ప ఆచరణ లేని కాంగ్రెస్ ప్రభుత్వమని వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు విమర్శించారు. మండల పరిధిలోని అల్వాలలో ఆరోగ్య ఉప కేంద్రం, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించి ఆరు నెలలు దాటినా ఇప్పటి వరకు వాటిని వినియోగంలోకి తేవడం లేదంటూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట భవనాల ఫొటోలను ప్రదర్శిస్తూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల క్రితం మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అల్వాలలో ఓపెన్ జిమ్‌కు శంకుస్థాపన, ఆరోగ్య ఉపకేంద్రం, గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారన్నారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రజల అవసరాలను గుర్తించి ఆరోగ్య ఉప కేంద్రం, గ్రామ పంచాయతీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే ఓపెన్ జిమ్‌కు నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ అహ్మద్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సూకూరి లింగం, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, గొట్టం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న వైస్‌ఎంపీపీ పోలీస్ రాజులు తదితరులు

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక: దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని తెలిపారు. కామర్స్‌లో రెండు, తెలుగులో ఒకటి, కంప్యూటర్ సైన్స్ ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం కంటే ఎక్కువ మార్కులు ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు జులై 1 తేదీ లోగా కళాశాలలో సంప్రదించాలన్నారు. నీట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

హిందీ బోధించేందుకు..

కొండపాక(గజ్వేల్): కొండపాక మోడల్ స్కూల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో హిందీ బోధించేందుకు గంటల పద్ధతిలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ వన్నీసా తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జులై 4వ తేదీన ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించండి



వినతి పత్రం ఇస్తున్న నముకు

మద్దూరు(హుస్నాబాద్): మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తూ, గ్రామాల అభివృద్ధికి చేయూత అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరినట్లు కొండాపూర్ ఎంపీటీసీ నముకు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందచేశామన్నారు. కొండాపూర్ పరిధిలోని హనుమతండ, దుబ్బ తండా, రెడ్యానాయక్ తండా, కూటిగల్, గ్రామాల్లో డ్రైనేజీ, సీసీ రోడ్డు, సబ్ స్టేషన్ నిర్మాణానికి సహకరించాలన్నారు. మంత్రి సానుకులంగా స్పందించారన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

వర్గల్(గజ్వేల్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వర్గల్ నవోదయ, పూలే గురుకుల జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో వైద్యారోగ్య సిబ్బంది దోమల నివారణ మందు పిచికారీ చేపట్టారు. శనివారం ఆయా విద్యాలయాల్లో దోమల నివారణకు టెయోపాస్ ద్రావణం పిచికారీ చేశారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, ఫైలేరియా వ్యాధుల బారిన పడే అవకాశముందన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.



వర్గల్ నవోదయలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

అందరూ సమానత్వం పాటించాలి



బండచెర్లపల్లిలో సివిల్ రైట్స్ డే సమావేశంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

సిద్దిపేటరూరల్: గ్రామాల్లో కులమత బేధాలు లేకుండా రాజ్యాంగం కల్పించిన అన్నిహక్కులను సాధిస్తూ సమానత్వం పాటించాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని బండచెర్లపల్లి గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. మొదట గ్రామంలోని దళిత వాడలను సందర్శించారు. అనంతరం ఏర్పాట్లు చేసిన సమావేశంలో వారు ఎదుర్కొటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రలేఖ, కానిస్టేబుల్ రాకేశ్, మాలమహానాడు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సోదర భావంతో మెలగాలి

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగంపేట గ్రామంలో శనివారం పౌరహక్కుల దినం నిర్వహించారు. ఆర్ఐ అశోక్‌రాజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రాంరెడ్డి మాట్లాడుతూ ప్రజలు కులమతాలకతీతంగా సోదరభావంతో జీవించాలన్నారు. కులమతాల పేరుతో ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుల వివక్ష పాటిస్తే..

కోహెడ(హుస్నాబాద్): కులవివక్ష పాటిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిరుపతి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన పౌరహక్కుల దినంలో మాట్లాడారు. కులవివక్ష చూపిన వారిపై నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామంలో స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో ప్రజలు జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఖమ్మం స్వరూప, ఆర్ఐ సురేందర్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ మైపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, జగన్‌రెడ్డి, ధర్మయ్య, రాజయ్య, గోపి, జాన్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పరుగుతోనే ఆరోగ్య పరిరక్షణ



మారథాన్ పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ లతీఫ్

కొండపాక(గజ్వేల్): ఆరోగ్య రక్షణకు రన్నింగ్ చేయాలని సీఐ లతీఫ్ అన్నారు. జులై 28వ తేదీన నిర్వహించనున్న సిద్దిపేటలో 2వ ఎడిషన్ హాఫ్ మారథాన్ పోస్టర్‌ను కొండపాకలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరూ రోజూ రన్నింగ్ చేయాలన్నారు. ప్రజా ఆరోగ్యం కోసం నిర్వహించే మారథాన్‌లో 5 కేఎం, 10 కేఎం, 212 కేఎం కేటగిరీలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు 21 కేఎం, 14 ఏళ్ల నిండిన వారు 10 కేఎం, 10 ఏళ్ల నిండిన వారు 5 కేఎంలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఇందులో పాల్గొనే వారు రుసుము చెల్లించి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి అమరేందర్‌రెడ్డి (9573034372) కోరారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు శనివారం జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తాతో పాటు పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 18 మంది పట్టుబడ్డారు.

అటవీశాఖ కార్యాలయం ఖాళీ



సిబ్బందిలేని అటవీశాఖ కార్యాలయం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఐటీసీ సముదాయంలోని అటవీశాఖ కార్యాలయం శనివారం అధికారులు లేకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయు. కార్యాలయానికి ఎప్పుడు వచ్చినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ పనుల సమయంలో గట్ల మీద చెట్లను తొలగించాలంటే అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీనికి కోసం రైతులు కార్యాలయం చుట్టూ తిరిగినా సిబ్బంది అందుబాటులో ఉండటంలేని మండిపడుతున్నారు. ఎఫ్ఆర్ఓ సందీప్‌కుమార్‌ను వివరణ కోరగా సిబ్బంది ఫారెస్ట్‌లో మొక్కలు నాటేందుకు గుంతలు తీయిస్తున్నారని చెప్పారు.

సేంద్రియ పంటల సాగు చేపట్టాలి



మాట్లాడుతున్న ఏఓ వసంతరావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సేంద్రియ పంటలు ఆరోగ్యకరమని, చిరుధాన్యాల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని ఏఓ వసంతరావు అన్నారు. శనివారం హైదరాబాద్ హర్ప్ డయాసిస్ సాంఘిక సేవా సంస్థ (హస్), ఉజ్వల శ్రీ సంయుక్త ఆధ్వర్యంలో అలిరాజ్‌పేట గ్రామంలో సేంద్రియ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలైన చిరుధాన్యాల పంటలను సాగు చేయాలన్నారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆంథోని, కోఆర్డినేటర్ దీపిక, సిబ్బంది కిష్టయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి

బెజ్జంకి(సిద్దిపేట): సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సహాయ అధికారి రాజు అన్నారు. బెజ్జంకిలోని ఎస్సీ విద్యార్థుల వసతి గృహాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ రికార్డులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. మెనూ వివరాలు తెలుసుకున్నారు. ప్రతీనెల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్ ఇబ్బందులకు గురిచేస్తోంది

దుబ్బాకటౌన్: సాధ్యంకాని హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని దౌల్తాబాద్ బీజేపీ నాయకుడు పోతరాజు కిషన్ అన్నారు. శనివారం దౌల్తాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలన పక్కన పెట్టి సీఎం రేవంత్ రెడ్డి ఇతర పార్టీల ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునే పనిలో ఉన్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింహులు, సురేందర్ రెడ్డి, స్వామి, రామస్వామి పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు అండగా ఉంటా

దుబ్బాకటౌన్: విద్యార్థులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని దౌల్తాబాద్ ఎంపీటీసీ ఆది వనిత అన్నారు. శనివారం దౌల్తాబాద్ మోడల్ స్కూల్‌కు చెందిన వంద మంది విద్యార్థులకు తన సొంత ఖర్చుతో బస్సుపాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలోనే అసలైన ఆనందం ఉందన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ పాఠశాలకు విరాళం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని వడ్లూరు బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మినరల్ వాటర్ అందించేందుకు 2006–07లో చదువుకున్న విద్యార్థులు రూ.10 వేలు విరాళంగా శనివారం ఇన్‌చార్జి హెచ్‌ఎం భరత్‌రెడ్డికి అందజేశారు. వారిని హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, మనోహర్‌రెడ్డి, రామచంద్రం, శ్రీనివాస్, ఖలీమొద్దీన్, పూర్వ విద్యార్థులు, సంతోష్, శేఖర్, సురేష్ పాల్గొన్నారు.

◆ మట్టిని తొలగించాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళపల్లి గ్రామంలో కల్వర్టు వద్ద బీటీ రోడ్డు నిర్మించారు. అయితే ఈ రోడ్డుపై మట్టి కుప్పలు ఉండటంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

◆ అమ్మ ఆదర్శ పనుల్లో వేగం పెంచాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతుల్లో వేగం పెంచాలని ఎంపీపీ బాలేషంగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన బాలికల పాఠశాలలో అమ్మ ఆదర్శ మరమ్మతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి నిధులు కేటాయించిందన్నారు. పాఠశాలలు ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా పనుల్లో జాప్యం జరుగుతుందని, పనులను వేగవంతం చేయాలని కోరారు.

◆ ఉపాధ్యాయుడి మృతి

చేర్యాల(సిద్దిపేట): గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణ కేంద్రంలో శనివారం జరిగింది. పట్టణానికి చెందిన మేడిశెట్టి బాలరాజు(53) యాదవనగర్ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్నాడు. రోజులాగే శుక్రవారం రాత్రి భోజనం చేసి నిద్రించాడు. శనివారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో గుండె పోటు రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, చేర్యాల ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మద్దూరు ఎంపీపీ బద్దిపడిగ కృష్ణారెడ్డి పరామర్శించారు.

◆ విగ్రహం ధ్వంసం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం అంతక్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో రాత్రి వేళలో ఆకతాయిలు మద్యం తాగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాగిన మైకంలో విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిల ఆటలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

◆ నేడు మంత్రుల పర్యటన

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం పర్యటించనున్నారు. శ్రీ సరస్వతి శిశుమందిర్ హైస్కూల్ నూతన భవన ప్రారంభోత్సవానికి వారు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ డిక్షనరీల పంపిణీ

కొండపాక(గజ్వేల్): ఆంగ్లంపై పట్టు సాధించేందుకు డిక్షనరీలు దోహదపడుతాయని హెచ్‌ఎం సత్తయ్య పేర్కొన్నారు. మండల కేంద్రమైన కుకునూరుపల్లిలోని హైస్కూల్లో దాత తలకొక్కుల చంద్రకళ ట్రస్టు సహకారంతో శనివారం వంద డిక్షనరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.